

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



మంగళవారం 27-10-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :129 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

నవంబర్ 2న తెలంగాణకు అమిత్ షా!



బీజేపీ మహాపాదయాత్రలో పాల్గొననున్న షా

ఎస్ఐఆర్‌కు మద్దతుగా పాదయాత్ర

నవంబర్ 1న యాత్ర ప్రారంభం

పలుమార్లు వాయిదా పడిన పర్యటన

మే 2024లో చివరిసారిగా తెలంగాణకు షా

తెలంగాణపై బీజేపీ అధిష్ఠానం ఫోకస్

2 లో

మహాలక్ష్మి ప్రభావం.. తెలంగాణకు అగ్రస్థానం!

మహాలక్ష్మితో మహిళలకు కొత్త స్వేచ్ఛ

రోజుకు 37 లక్షల మంది ప్రయాణం

ఐదేళ్లలో 10.9 శాతం పాయింట్ల వృద్ధి

తమిళనాడు, కర్ణాటకను వెనక్కి నెట్టిన తెలంగాణ

పురుషుల కంటే మహిళల ప్రయాణాలే ఎక్కువ

దేశానికే ఆదర్శంగా మహాలక్ష్మి పథకం

పొన్నం ప్రభాకర్‌కు సీఎం అభినందనలు



2 లో

న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (ఇది కద నిజం): మహాలక్ష్మి పథకం అనేది కేవలం ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే కాదని, అది తెలంగాణ మహిళల ఆత్మగౌరవం, స్వేచ్ఛ, స్వయం ప్రతిపత్తికి ప్రతీక అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్ఎస్ఓ నిర్వహించిన ఆల్ ఇండియా టైమ్ యూజ్ సర్వేలో తెలంగాణ మహిళల ప్రయాణాలు గణనీయంగా పెరిగినట్లు వెల్లడికావడం గర్వకారణమన్నారు. మహిళలు ఈ పథకానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని, మహాలక్ష్మి అమలు దేశానికే ఆదర్శంగా మారిందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. మహిళల సాధికారత కోసం తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఈ గణాంకాలు నిదర్శనమని సీఎం పేర్కొన్నారు.

ధనుష్ గిఫ్ట్స్‌పై కమలం కలకలం!

వెండి దీపాలతో వివాదం

కమలం గుర్తుతో కలకలం

ధనుష్ పొలిటికల్ ఎంట్రీ?

బీజేపీ మద్దతుపై ఆరోపణలు

అభిమాన సంఘం క్లారిటీ

రాజకీయ సంబంధాలపై ఖండన

2 లో

తెలంగాణకు రెడ్ అలర్ట్!

నాలుగు జిల్లాలకు రెడ్ అలర్ట్

పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

గంటకు 60 కి.మీ. వేగంతో గాలులు

బలపడుతున్న బంగాళాఖాత వాయుగుండం

అతి తీవ్ర తుపానుగా రూపాంతరం

ఏపీ తీరానికి తుపాను ముప్పు



2 లో

న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (ఇది కద నిజం): బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ అల్పపీడనం ప్రభావంతో ఈనెల 29న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ప్రధానంగా తూర్పు, ఉత్తర తెలంగాణ జిల్లాలపై వర్ష ప్రభావం తీవ్రంగా ఉండనుంది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలలో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున ఐఎండీ ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే అదే రోజున రాష్ట్రంలోని కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు

రాహుల్ గాంధీ కాన్వాయ్ ప్రమాదంపై సిట్ ఏర్పాటు

యూపీ పోలీసుల దర్యాప్తు

వాహనాలు ఢీకొని ప్రమాదం

పలువురికి గాయాలు

భద్రతా వైఫల్యంపై ఆరా

డ్రైవర్ల వాంగ్మూలాల సేకరణ

సీసీటీవీ ఫుటేజీల పరిశీలన

2 లో

మహారాష్ట్ర ఓటర్లపై సుప్రీం నజర్!

మూడు రాష్ట్రాల్లో 38 చోట్ల సోదాలు

రూ.100 కోట్ల హవాలా గుట్టురట్టు

1,424 బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్

రూ.17.82 కోట్ల ఆస్తులు జప్తు

18 మంది నిందితుల అరెస్ట్

డెత్ ట్రయాంగిల్ కారిడార్‌పై దెబ్బ

2029 నాటికి డ్రగ్స్ నెట్‌వర్క్‌ల నిర్మూలన

2 లో

రాహుల్ గాంధీకి కోర్టులో భారీ ఊరట!



2 లో

న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (ఇది కద నిజం): లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ లీడర్ రాహుల్ గాంధీ కి ఉత్తరప్రదేశ్ సుల్తాన్‌పూర్ లోని ప్రజాప్రతినిధుల కోర్టులో భారీ ఊరట లభించింది. 2018 నాటి క్రిమినల్ పరువు నష్టం కేసును విచారించిన ప్రత్యేక కోర్టు, ఆయనపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ ఇవాళ తుది తీర్పు వెలువరించింది.

బ్యారేజీ ఎత్తుపై బిగ్ డీల్!

- తుమ్మిడిహెట్టిపై ఫడ్నవీస్ సానుకూలత
- 152 మీటర్ల ఎత్తుపై తెలంగాణ ప్రతిపాదన
- రేవంత్ బృందంతో కీలక భేటీ
- ఐదు దశాబ్దాలుగా పెండింగ్‌లో ప్రాజెక్టు
- ముంపు భూములకు పరిహారం చెల్లిస్తాం
- సాంకేతిక అంశాలపై సమగ్ర అధ్యయనం
- అధికారుల కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదన
- ఆదిలాబాద్ అభివృద్ధికి జల ప్రాజెక్టు
- మహారాష్ట్రకు నష్టం లేకుంటే పునఃపరిశీలన



న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (ఇది కద నిజం): తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర సీఎం సానుకూల స్పందించింది. సోమవారం ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశమైంది. ఈ భేటీలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై కీలక చర్చలు జరిగాయి. బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై చర్చించారు. భేటీ అనంతరం.. తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఓ పత్రికా ప్రకటన విడుదల చేసింది.

ఈ ప్రకటన ప్రకారం.. సమావేశం ప్రారంభంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు.

మిగతాది 2 లో..

సొంత ప్రభుత్వంపై అనిరుధ్ రెడ్డి ఫైర్



2 లో

న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (ఇది కద నిజం): మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సొంత ప్రభుత్వంపైనే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన రాజాపూర్ మండల పరిధిలోని రంగారెడ్డి గూడ, గుండ్ల పొట్లపల్లితో పాటు పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తన నియోజకవర్గ అభివృద్ధి, పూర్తయిన పనుల బిల్లుల విడుదల కోసం ఏకంగా 30 వేల మందితో కలిసి ఆమరణ నిరాహార దీక్షకు దిగడానికి కూడా సిద్ధంగా ఉన్నానని బాంబు పేల్చారు.

ఏపీకి తుపాను ముప్పు.. ఐఎండీ అలర్ట్!



2 లో

సోమవారం తుపానుగా మార్పు

మంగళవారానికి తీవ్ర తుపాను

తుపానుకు 'అర్నాబ్' పేరు

మూడు రోజులు భారీ వర్షాలు

గంటకు 125 కి.మీ. వేగంతో గాలులు

మత్స్యకారులకు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక

గ్రాడ్యుయేట్ ఓటర్లతో పార్టీలకు షాక్!

నమోదుకే డబ్బుల డిమాండ్

గ్రాడ్యుయేట్ల వింత ప్రశ్నలు

ఓటు నమోదుపై సందేహాలు

సంతకాలకు గెజిటెడ్ అధికారులు వెనుకడుగు

నిబంధనలపై ఓటర్ల అభ్యంతరాలు

గేటెడ్ కమ్యూనిటీల్లోనూ అడ్డంకులు

సగం కూడా చేరని నమోదు



2 లో

న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (ఇది కద నిజం): గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదులోనే రాజకీయ పార్టీల నాయకులకు చిత్ర విచిత్రమైన అనుభవాలు ఎదురవుతున్నాయి. గ్రాడ్యుయేట్లు, డిప్లొమో అర్హత ఉన్న వారు ఓటు నమోదు చేసుకోవడానికి అర్హులు. అయితే వీరు నిరక్ష్యరాస్యుల కంటే అధ్వాన్నంగా వ్యవహరిస్తున్నారని నాయకులు మండిపడుతున్నారు. చదువుకున్నవారే సులువుగా ఓటరు నమోదుకు ముందుకు వస్తారని అంచనా వేసిన రాజకీయ నాయకులకు షాకింగ్ విషయాలు ఎదురవుతున్నాయి.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 27-10-2026

సొంత ప్రభుత్వంపై అనిరుధ్ రెడ్డి ఫైర్

మొదటి పేజీ తరువాయి

మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులా..

సచివాలయం, ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన అనిరుధ్ రెడ్డి.. కేవలం మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులు చెల్లిస్తారా అని ప్రశ్నించారు. మరి మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటని సూటిగా నిలదీశారు. ఇటీవల ఓ కాంట్రాక్టర్ చనిపోతే ఆయనకు రూ.5 కోట్ల బిల్లు మంజూరు చేశారని గుర్తుచేస్తూ.. 'అలాగైతే తన నియోజకవర్గ పనుల బిల్లుల కోసం నేనే చస్తేగానీ నిధులు మంజూరు చేయరా?' అంటూ అనిరుధ్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

పార్టీలకు అతీతంగా నీళ్ల కోసం పోరాటం..

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు సమాంతరంగా అభివృద్ధి చెందితేనే ప్రభుత్వానికి మనుగడ ఉంటుందని అనిరుధ్ రెడ్డి అన్నారు. జడ్చర్ల నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు పార్టీలకు అతీతంగా పోరాడి నీటిని సాధించుకుంటామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ఎలాంటి పోరాటానికైనా వెనుకాడేది లేదన్నారు. తన నియోజకవర్గంలో ఇప్పటికే పూర్తయిన, అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రాహుల్ గాంధీకి కోర్టులో భారీ ఊరట!

మొదటి పేజీ తరువాయి

ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అమిత్ షా పరువుకు నష్టం కలిగించేలా లేవని స్పష్టం చేసింది. తీర్పు వెలువడే సమయంలో రాహుల్ గాంధీ స్వయంగా సోమవారం సుల్తాన్‌పూర్ కోర్టుకు హాజరయ్యారు. న్యాయస్థానం కేసును కొట్టివేస్తున్నట్లుగా ప్రకటించడంతో కాంగ్రెస్ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశాయి.

కాగా, 2018 కర్ణాటక ఎన్నికల ప్రచార సమయంలో బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు, ప్రస్తుత కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ సుల్తాన్‌పూర్‌కు చెందిన స్థానిక బీజేపీ నాయకుడు విజయ్ మిశ్రా పరువు నష్టం దావా వేశారు. సుదీర్ఘకాలంగా విచారణలో ఉన్న ఈ కేసును పరిశీలించిన ప్రజాప్రతినిధుల కోర్టు.. రాహుల్ గాంధీకి అనుకూలంగా తీర్పునిస్తూ కేసును డిస్మిస్ చేసింది.

మహాలక్ష్మి ప్రభావం.. తెలంగాణకు అగ్రస్థానం!

మొదటి పేజీ తరువాయి

రోజుకు 37 లక్షల మంది మహిళల ప్రయాణం:

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఈ పథకం మహిళలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు గౌరవప్రదమైన జీవనానికి కొత్త మార్గాలను తెరిచిందన్నారు. ప్రస్తుతం ప్రతిరోజూ 37 లక్షల మంది వరకు మహిళలు టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తూ పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగ ప్రాంతాలకు చేరుకుంటున్నారని వెల్లడించారు. మహిళల ఆర్థిక భారాన్ని తగ్గించడంతో పాటు స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశాన్ని మహాలక్ష్మి కల్పిస్తోందని పేర్కొన్నారు.

పొన్నం ప్రభాకర్‌కు సీఎం ప్రశంసలు

మహాలక్ష్మి పథకం విజయవంతంగా అమలవుతుండటంపై సీఎం రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్న మహిళల పట్ల గర్వంగా ఉందన్నారు. ప్రతిరోజూ లక్షలాది మంది మహిళలకు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రవాణా శాఖను సమర్థవంతంగా నడిపిస్తూ మహాలక్ష్మి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అభినందించారు. మహిళల సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకం దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందుతోందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణ టాప్:

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో రాష్ట్రంలో మహిళల ప్రయాణాలు గణనీయంగా పెరిగాయి. దేశవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే మహిళల రాకపోకల్లో అత్యధిక వృద్ధి నమోదైంది. జాతీయ గణాంక కార్యాలయం నిర్వహించిన ఆల్ ఇండియా టైమ్ యూజ్ సర్వే గణాంకాల డేటాను ఓ ఆంగ్ల దినపత్రిక ప్రచురించింది. 2019లో తెలంగాణలో 15 నుంచి 59 ఏళ్ల వయసున్న మహిళల్లో రోజుకు కనీసం ఒక్కసారైనా బయటకు ప్రయాణించిన వారి శాతం 43.7గా ఉండగా, 2024 నాటికి అది 54.6 శాతానికి పెరిగింది. అంటే ఐదేళ్ల వ్యవధిలో 10.9 శాతం పాయింట్ల పెరుగుదల నమోదైందని ఈ సర్వే పేర్కొంది. అలాగే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మహిళల ప్రయాణాల తీరును ఈ కథనంలో వివరించింది. ముఖ్యంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాల్లో మహిళల రాకపోకలు పెరిగినట్లు వెల్లడించింది. తెలంగాణలో మహిళల ప్రయాణాలు 10.9 శాతం పాయింట్లు పెరగగా, తమిళనాడులో 6.7, కర్ణాటకలో 5, పంజాబ్‌లో 4.1 శాతం పాయింట్ల వృద్ధి నమోదైంది. ఇదే సమయంలో తెలంగాణలో పురుషుల ప్రయాణాలు 7.1 శాతం పాయింట్లు పెరిగాయి. అంటే పురుషులతో పోలిస్తే మహిళల ప్రయాణాల్లో 3.8 శాతం పాయింట్ల అదనపు వృద్ధి కనిపించింది. ఉచిత బస్సు ప్రయాణ పథకాలు అమలవుతున్న నాలుగు రాష్ట్రాల్లో మహిళల ప్రయాణాలు సగటున 6.6 శాతం పాయింట్లు పెరగగా, ఇతర రాష్ట్రాల్లో 4.4 శాతం పాయింట్ల వృద్ధి మాత్రమే నమోదైనట్లు ఈ కథనం పేర్కొంది.

గ్రాడ్యుయేట్ ఓటర్లతో పార్టీలకు షాక్!

మొదటి పేజీ తరువాయి

ఓటు నమోదు వెలితే అనేక మంది గ్రాడ్యుయేట్లు ఏం లేదా మరీ ...? అంటూ నాయకులను ప్రత్యక్షంగా కొందరు, పరోక్షంగా కొందరు డబ్బుల కోసం సంకేతాలు ఇస్తున్నారు. దీంతో రాజకీయ నాయకులు 'వీళ్లేం చదువుకున్నోళ్లు...' అంటూ విస్తుపోతున్నారు. స్వచ్ఛందంగా ఓటు నమోదు చేసుకోవాల్సిన వాళ్ల కోసం.. రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, ప్రతినిధులు ఇంటికి వెళ్లి ఓటు నమోదుకు సహకారం చేస్తుంటే.. 'ఏం లేదా మరీ..' అనే డిమాండ్ రావడాన్ని ప్రశ్నిస్తున్నారు.



సవాలక్ష సందేహాలు..

ఫారం ఇచ్చి వెళ్లండి.. తరువాత పూర్తి చేసి ఇస్తాం... అని కొందరు, ఏం.. ఓటు వేయకుంటే ఏమైతది.. అని మరికొందరు, ఈ ఓటు వేస్తే ప్రభుత్వాలు మారితాయా..? అని ఇంకొందరు ప్రశ్నిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు చేసిన వారు గెజిటెడ్ సంతకాలు కావాలని నిబంధనను విధించడంతో గెజిటెడ్ అధికారులు సంతకాలు చేయడానికి జంకుతున్నారు. ఏఐ టెక్నాలజీతో తయారు చేసిన సర్టిఫికెట్లా అంటూ సందేహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు అయితే సంతకాలు చేయడానికి నిరాకరిస్తున్నారు. మరికొందరు అయితే గతంలోనే నమోదు చేసుకున్నామని, ఓటు కూడా వేశామని, మళ్లీ నమోదు ఎందుకు? ఇదెక్కడి రూల్ అంటూ ఓటు నమోదు విధానాన్నే ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సంఘం నిబంధనను వారు నిలదీస్తున్నారు. ప్రతి ఆరేండ్లకు ఓటు నమోదు నిబంధనను మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో అత్యధిక గ్రాడ్యుయేట్లు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరు ఓటు వేయడానికి తమ ప్రాంతానికి వెళ్లడానికి ఆసక్తి చూపడంలేదు. ఇక గేటెడ్ కమ్యూనిటీల్లో ఉండే వారికి నమోదుపై అవగాహన కల్పించడానికి ఆ కమ్యూనిటీలో ఎంట్రీ దొరకడంలేదని నాయకులు వాపోతున్నారు.

సగం ఓటర్లే నమోదు..

హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో ఇప్పటి వరకు 2,47,093 ఓటర్లు నమోదు చేసుకున్నారు. 2021లో ఎన్నికలు జరిగిన సమయంలో ఇదే నియోజకవర్గంలో 5,76,462 మంది ఓటర్లు తమ ఓటును నమోదు చేసుకున్నారు. వీరిలో 5.31లక్షల మంది ఓటర్లు అర్హులుగా తేలారు. అంటే గతంలో నమోదు అయిన ఓటర్లలో ఇప్పటి వరకు 43 శాతం మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. నల్గొండ- ఖమ్మం-వరంగల్ జిల్లాల పరిధిలో ఇప్పటి వరకు 3,11,095 ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోగా 2021లో 5,63,282 ఓటర్లు దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఇప్పటి వరకు 55 శాతం దరఖాస్తులు వచ్చాయి.

ధనుష్ గిఫ్ట్స్‌పై కమలం కలకలం!



న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (ఇది కద నిజం): తమిళనాడు రాజకీయాల్లో ప్రముఖ సినీ నటుడు ధనుష్ పొలిటికల్ ఎంట్రీపై జోరుగా చర్చ సాగుతోంది. తాజాగా చెన్నైలో ఆయన అభిమాన సంఘం నర్పణి ఇయక్కమ్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా కార్యకర్తల సమావేశం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. ఈ సమావేశంలో మహిళలకు బహూకరించిన వెండి దీపాలపై తామర పువ్వు గుర్తు ఉండటం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. అయితే, ధనుష్ త్వరలోనే తమిళగ ఎజ్జుచి కజగం పేరుతో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తారనే ఊహాగానాలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన పంపిణీ చేసిన బహుమతులపై జాతీయ పార్టీ అయిన బీజేపీ ఎన్నికల గుర్తు అయిన తామర సింబల్ ఉండటంతో.. తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్ అయింది. ధనుష్ రాజకీయాల్లోకి వచ్చేందుకు బీజేపీ తెర వెనుక మద్దతు ఇస్తోందంటూ కాంగ్రెస్ సహా పలు రాజకీయ పార్టీలు ఆరోపణలు గుప్పించాయి.

స్పందించిన ధనుష్ అభిమాన సంఘం..

ఈ విమర్శలపై ధనుష్ నర్పణి ఇయక్కమ్ వర్గాలు వెంటనే క్లారిటీ ఇచ్చాయి. ఆ దీపాలపై ఉన్న తామర గుర్తుకు ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని, అది కేవలం తయారీదారుడి ముద్ర మాత్రమేనని కొట్టిపారేసినట్లుగా తెలిసింది. ఒకవేళ మాకు ఏ రాజకీయ పార్టీతోనైనా సంబంధం ఉన్నా.. మరో పార్టీ ఎన్నికల గుర్తును బహిరంగంగా వాడేంత మూర్ఖులం కాదని ఆ సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు.

తెలంగాణకు రెడ్ అలర్ట్!

మొదటి పేజీ తరువాయి

గంటకు 50 నుండి 60 కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం

తూర్పు మధ్య, దానిని ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్రరూపం దాల్చుతోంది. నేడు తీవ్ర వాయుగుండం మరింత బలపడి తుపానుగా మారుతుంది. నేడు ఉదయం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఇది తీవ్ర తుపానుగా రూపాంతం చెందుతుంది. ఈనెల 28న ఉదయం వాయువ్య దిశగా కదులుతూ అతి తీవ్ర తుపానుగా మారి ఏపీ తీరానికి చేరుకుంటుంది. అక్టోబర్ 28న మధ్యాహ్నంలోపు ఈ అతి తీవ్ర తుపాను బాపట్ల, విశాఖపట్నం మధ్య ఆంధ్రప్రదేశ్-యానాం తీరాలను దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 115 నుండి 125 కిలోమీటర్ల వేగంతో, గరిష్టంగా 140 కిలోమీటర్ల వేగంతో పలకరించే ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ కారణంగా తెలంగాణలో కూడా అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని ఐఎండీ తెలిపింది.

మహారాష్ట్ర ఓటర్లపై సుప్రీం నజర్!



న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (ఇది కద నిజం): కేంద్ర ఎన్నికల సంఘం మహారాష్ట్రలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు తుది గడువును తక్షణమే పొడిగించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. మహారాష్ట్రలో నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియలో దాదాపు 33 శాతం మంది ఓటర్ల పేర్లను అక్రమంగా తొలగించారని ఆరోపిస్తూ పిటిషనర్ అరుణ్ ఆనందగిరి దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది అరవింద్ దాతార్ వాదనలు వినిపిస్తూ.. ముంబై, పూణే నగరాల్లో సుమారు 3,500 పునరాభివృద్ధి ప్రాజెక్టులు (రీడెవలప్‌మెంట్) సాగుతున్నాయని, పాత కాలనీల కూల్చివేత వల్ల వేలాది మంది ప్రజలు వేరే ప్రాంతాలకు మారారని తెలిపారు. చిరునామా వివరాలు సరిపోలడం లేదన్న నెపంతో వారి పేర్లను తొలగించే ప్రమాదం ఉందని వివరించారు. ఇప్పటికే ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నవారి కోసం ఈసీ ప్రత్యేక ఫారమ్‌ను ప్రవేశపెట్టాలని, కొత్త ఓటర్ల కోసం ఉద్దేశించిన ఫారమ్-6ను పాత ఓటర్లతో నింపించడం చట్టవిరుద్ధమని వాదిస్తూ.. ఓటర్ల జాబితా ఖరారు ప్రక్రియపై స్టే విధించాలని, నేటితో ముగిసే అభ్యంతరాల గడువును పొడిగించాలని కోరారు.

అయితే, సోమవారానికి గడువును తక్షణమే పొడిగించే మధ్యంతర ఆదేశాలను జారీ చేయడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. కాగా ఈ పిటిషన్‌పై సమగ్ర వివరణ కోరుతూ భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ లేవనెత్తిన అంశాలపై ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చిన సీజేఐ ధర్మాసనం.. "మీరు ప్రజల తరఫున నిజాలు బయటపెట్టే విజిల్ బ్లోయర్ లాంటి వారు, మా వద్దకు వచ్చారు కాబట్టి భయపడాల్సిన అవసరం లేదు. పత్రాలు సమర్పించని అర్హులైన ఓటర్లు ఇంకా మిగిలి ఉన్నట్లు విచారణలో తేలితే గతంలో మాదిరిగానే గడువును పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేస్తాం" అని స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై తదుపరి సమగ్ర విచారణను సుప్రీంకోర్టు నవంబర్ 5వ తేదీకి వాయిదా వేసింది.

రాహుల్ గాంధీ కాన్వాయ్ ప్రమాదంపై సిట్ ఏర్పాటు



న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (ఇది కద నిజం): కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఉత్తర్‌ప్రదేశ్ పర్యటన సందర్భంగా ఆయన కాన్వాయ్‌లోని వాహనాలు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై యూపీ పోలీస్ శాఖ అత్యున్నత స్థాయి విచారణకు ఆదేశించింది. సుల్తాన్‌పూర్ పర్యటనలో భాగంగా ఎక్స్‌ప్రెస్‌వేపై ఆయన కాన్వాయ్ వెనుక ప్రయాణిస్తున్న వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న తీవ్ర ఉదంతాన్ని సమగ్రంగా విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు సోమవారం అధికారికంగా ప్రకటించారు. ఈ ఘటనలో పలు వాహనాలు దెబ్బతినడంతో పాటు కొందరు గాయపడగా, రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్న వాహనం సురక్షితంగా బయటపడిన విషయం తెలిసిందే. అయితే విపక్ష నేత కాన్వాయ్ ప్రయాణంలో ఈ స్థాయి ప్రమాదం చోటుచేసుకోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది.

కాన్వాయ్ ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు, అసలు ఎక్కడ లోపం జరిగిందనే అంశాలను సిట్ బృందం సమగ్రంగా పరిశీలించనుంది. ముఖ్యంగా వీఐపీ కాన్వాయ్ భద్రతా ఏర్పాట్లు, ఎస్కార్ట్ వాహనాల సమన్వయం మరియు రహదారిపై ట్రాఫిక్ నిర్వహణలో ఏదైనా తీవ్రమైన నిర్లక్ష్యం లేదా భద్రతా వైఫల్యం (సెక్యూరిటీ లాప్స్) ఉందా అనే కోణాలపై దర్యాప్తు దృష్టి సారించనుందని పోలీస్ ఉన్నతాధికారులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాద స్థలంలోని సీసీటీవీ ఫుటేజీలు, కాన్వాయ్ డ్రైవర్ల వాంగ్మూలాలను సేకరించి త్వరితగతిన నివేదికను సమర్పించాలని సిట్‌ను ఆదేశించారు.

నవంబర్ 2న తెలంగాణకు అమిత్ షా!

న్యూస్ డెస్క్, 26 అక్టోబర్ (ఇది కద నిజం): బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన ఖరారైంది. నవంబరు 2న ఆయన రానున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌కు మద్దతుగా బీజేపీ చేపట్టిన " లోక్ తంత్ర బచావో.. అరాచకత హటావో' కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ముసుగులో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ కాంగ్రెస్, కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలను తిప్పికొట్టేందుకు బీజేపీ మహాపాదయాత్ర చేయాలని నిర్ణయించింది. నవంబర్ 1న హైదరాబాద్‌లో ప్రారంభమయ్యే పాదయాత్రలో నవంబరు 2న అమిత్ షా పాల్గొంటారు.

వాస్తవానికి అమిత్ షా తెలంగాణ పర్యటన గత రెండున్నరేళ్లుగా అనేకసార్లు వాయిదాపడింది. ఈ నెల 3, 4వ తేదీల్లోనే ఆయన తెలంగాణలో పర్యటించాల్సి ఉండగా.. ఆకస్మికంగా రద్దయ్యింది. ఆ పర్యటనలో మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఏర్పాటు చేసిన అధికారిక, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. ఇందుకోసం ఏర్పాట్లన్నీ పూర్తిచేయగా.. అనూహ్యంగా పర్యటన రద్దుచేసుకున్నారు. అయితే, కారణాలు ఏంటి? అనేది మాత్రం వెల్లడించలేదు.

అమిత్ షా చివరిసారిగా తెలంగాణకు మే 2024లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కోసం వచ్చారు. ఆ తర్వాత వివిధ సందర్భాల్లో షా రావాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల పర్యటనలు రద్దయ్యాయి. వరంగల్ జిల్లాలో ఓ కార్యక్రమానికి, ఖమ్మం జిల్లాలో బీజేపీ కార్యకర్తలతో భేటీకి, కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ వైద్య కళాశాల రజతోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు షెడ్యూల్ ఖరారైనా చివరి నిమిషంలో రద్దుకావడం గమనార్హం.

తెలంగాణలో పార్టీ బలోపేతంపై బీజేపీ అధిష్ఠానం దృష్టిసారించింది. అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ, అధికారమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో కార్యాచరణ ప్రారంభించింది. రాష్ట్రస్థాయి నేతలు పోరాటం చేస్తున్నా.. నేరుగా అగ్రనేతలే రంగంలోకి దిగబోతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా తదితరులు వచ్చే రెండు నెలల్లో తెలంగాణలో పర్యటించనున్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే షా నవంబరులో తెలంగాణకు వస్తున్నట్టు తెలుస్తోంది.

బ్యారేజీ ఎత్తుపై బిగ్ డీల్!

మొదటి పేజీ తరువాయి

గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను వివరించారు. ఆ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, ఎస్బి చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి.. వివిధ దశల్లో ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగాయని గుర్తుచేశారు. అయినప్పటికీ ఆశించిన పురోగతి సాధించలేకపోయామన్నారు.

2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. అయితే, ఈ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమన్నారు. అందుకే గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ--మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేశారు. పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమని తెలిపారు. అక్కడి గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మహారాష్ట్ర సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తుచేశారు. ఆ పోరాట కాలం నుంచి ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని వివరించారు. ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాల పరంగా ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నారు. రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పున: పరిశీలించేందుకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫడ్నవీస్ స్పష్టం చేశారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 27-10-2026

సింగూరు జలాశయం నుంచి రోజు విడిచి రోజు బల్క్ నీటి సరఫరా

- ఎల్‌నినో ప్రభావంతో తగ్గుతున్న నీటిమట్టం
- తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

– ఈఈ ఎస్. స్వప్న



ఇది కద నిజం, నిజామాబాద్ జిల్లా : సింగూరు జలాశయంలో నీటిమట్టం తగ్గుతున్న నేపథ్యంలో బల్క్ నీటి సరఫరాపై అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇకపై రోజు విడిచి రోజు బల్క్ నీటిని సరఫరా చేయనున్నట్లు బాన్సువాడ మిషన్ భగీరథ గ్రిడ్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్. స్వప్న సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో జలాశయంలో నీటి నిల్వలు తగ్గుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 28న ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు, 29న బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాలకు బల్క్ నీటిని సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని సరఫరా షెడ్యూల్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

నీటి వృథాను అరికట్టాలి. ప్రజలు సహకరించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించుకోవాలని ఈఈ ఎస్. స్వప్న సూచించారు. అవసరానికి మించి నీటిని వినియోగించకుండా, నీటి వృథాను అరికట్టాలని కోరారు. భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే, అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ నీటి వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. నీటి నిల్వలు తగ్గుతున్న పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కను విలువైనదిగా భావించి జాగ్రత్తగా వినియోగించాలని తెలిపారు. నీటి కొరతను అధిగమించేందుకు అధికారులు చేపడుతున్న చర్యలకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు నీటి పొదుపుపై అవగాహన పెంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే అందరికీ తాగునీటిని అందించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.

పిట్లం చౌరస్తాలో బొలెరో వాహనం బోల్తా

- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు
- ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: డెగ్లూర్ నుంచి హైదరాబాద్‌కు కూరగాయల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం సోమవారం ఉదయం అదుపుతప్పి పిట్లం చౌరస్తా వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) సిబ్బంది వెంటనే స్పందించి గాయపడిన డ్రైవర్‌ను పిట్లం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ డ్రైవర్‌కు వైద్య చికిత్స అందించారు. కూరగాయల లోడుతో వెళ్తున్న వాహనం చౌరస్తా వద్ద బోల్తా పడటంతో స్థానికంగా కలకలం నెలకొంది.

రేణిగుంట గ్రామంలో అప్పుల బాధతో ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య





ఇది కద నిజం, యాదాద్రి భువనగిరి: సులువుగా డబ్బు సంపాదించవచ్చనే ఆశతో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ఉచ్చులో చిక్కుకుని, రూ.లక్షల్లో అప్పులపాలైన ఓ వ్యక్తి ప్రాణాలు తీసుకున్న విషాదకర ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటుచేసుకుంది.పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజపేట మండలం రేణిగుంట గ్రామానికి చెందిన గంధమల్ల భరత్ కుమార్ గౌడ్, భువనగిరిలోని ఒక అద్దె ఇంట్లో నివాసముంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి భార్య, ఒక కూతురు ఉన్నారు. కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు అలవాటుపడిన భరత్ కుమార్ భారీగా డబ్బులు నష్టపోయి తీవ్ర అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక, మనోవేదనకు గురైన అతను ఇంట్లో ఎవరూ లేని సమయంలో సూసైడ్ నోట్ రాసి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబానికి ఆధారంగా ఉండి నడిపించాల్సిన వ్యక్తి అప్పుల బాధ తాళలేక ఈ అఘాయిత్యానికి ఒడిగట్టడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనతో రేణిగుంట గ్రామంలో తీవ్ర శోకఛాయలు అలుముకున్నాయి.

యువత బెట్టింగ్ యాప్‌ల బారిన పడొద్దు: పోలీసుల హెచ్చరిక

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ మోసపూరితమైన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను నమ్మి జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు విజ్ఞప్తి చేశారు. శ్రమపడి సంపాదించిన డబ్బే శాశ్వతమని, త్వరితగతిన డబ్బు సంపాదించవచ్చనే వ్యసనాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు.

యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఆకాష్ యాదవ్





ఇది కద నిజం, యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా యాదాద్రి డివిజన్ డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, సీఐలు, ఎస్ఐలు తదితర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని జనరల్ డైరీ (జీడీ) పుస్తకం, వివిధ రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు.స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును పరిశీలించడంతో పాటు, అనుమానిత వ్యక్తుల షీట్లు, రౌడీ షీట్లను తనిఖీ చేశారు. నేర నియంత్రణకు సంబంధించి పోలీసుల నిఘాను మరింత పటిష్టం చేయాలని, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి విధుల నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలు, పోలీస్ స్టేషన్ పనితీరు తదితర అంశాలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ ఆవరణతో పాటు పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రతను పాటిస్తూ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు.ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, నేరాల నియంత్రణకు సమర్థవంతంగా పనిచేయాలని, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ సిబ్బందికి సూచించారు.

బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా గ్రామీణ యువతి సాయిశ్రీ



ఇది కద నిజం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లిగోరి

పట్టుదల, క్రమశిక్షణ ఉంటే గ్రామీణ నేపథ్యం ఉన్నత లక్ష్యాలకు అడ్డంకి కాదని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన గాదె సాయిశ్రీ నిరూపించారు. ఆమె తెలంగాణ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదై తన కల సాకారం చేసుకున్నారు. కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లికి చెందిన గాదె వీరస్వామి, సవిత దంపతుల కుమార్తె సాయిశ్రీ సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి పట్టుదలతో న్యాయవిద్యను పూర్తి చేశారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించి కుటుంబంతో పాటు గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. సాయిశ్రీ విజయం గ్రామీణ ప్రాంత యువతులకు స్ఫూర్తిదాయకమని స్థానికులు కొనియాడారు. కుమార్తె న్యాయవాదిగా నమోదు కావడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేయగా, బాధితులకు అండగా నిలుస్తూ వృత్తిలో మరింతగా రాణించాలని గ్రామస్థులు, బంధువులు, మిత్రులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

పిట్లం పరిధిలో నాలుగు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా : కామారెడ్డి జిల్లా పిట్లం మండల పరిధిలోని పిట్లం, అన్నారం, రాంపూర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులకు ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, సహకార సంఘం చైర్మన్ రామ్‌రెడ్డి, పిట్లం గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్, ఉపసర్పంచ్ హవేజ్ బేగ్, చిల్లర్గి సహకార సంఘం ముఖ్య కార్యనిర్వహణ అధికారి సంతోష్‌రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్లు, మార్గల దయానంద్, జుక్కల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట ఆలయ భద్రతపై సమీక్ష

సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ

ఆలయానికి వచ్చే భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత
సీసీ కెమెరాల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
-- జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్





ఇది కద నిజం, యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ భద్రతపై ఆలయ ఈఓ, ఎస్పీఎఫ్ అధికారులతో కలిసి ఈఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తుల భద్రత, నేరాల నివారణ, భద్రతా ఏర్పాట్ల పటిష్టతపై అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం ఎస్పీ యాదగిరిగుట్టలోని కల్యాణకట్ట, పుష్కరిణి (గుండం) ప్రాంతాలను సందర్శించి అక్కడి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, అన్ని కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కీలకమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, నిరంతర నిఘా, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పర్యవేక్షణ, భద్రతా తనిఖీలను మరింత పటిష్టం చేయాలని సూచించారు.ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్, ఎస్పీఎఫ్, ఆలయ అధికారుల మధ్య సమన్వయంతో పనిచేయాలని, నేరాల నివారణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఆలయ ఈఓ భవానీ శంకర్, యాదాద్రి డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరి రావు, సీఐ శంకర్, ఆర్ఐ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట దేవస్థానంలో వైభవంగా శరత్ పూర్ణిమ వేడుకలు

ఇది కద నిజం: యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శరత్ పూర్ణిమను పురస్కరించుకొని సోమవారం రాత్రి ప్రత్యేక కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.శరత్ పూర్ణిమ విశిష్టత:.మన సంప్రదాయములో శరత్ పూర్ణిమకు విశేష ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. దీనిని కౌముది పూర్ణిమ అని కూడా పిలుస్తారు. శరదృతువులో వచ్చే ఈ పౌర్ణమి వెన్నెల సౌందర్యానికి, ఆధ్యాత్మిక ప్రశాంతతకు ప్రతీకగా నిలుస్తుంది. పురాణ సంప్రదాయాల ప్రకారం, అలాగే కొన్ని ప్రాంతాల్లో శ్రీ లక్ష్మీ దేవి సమేతులైన శ్రీ నరసింహస్వామి వారిని విశేషంగా ఆరాధిస్తూ, కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఐశ్వర్యం, శాంతి, శ్రేయస్సు కలగాలని ప్రార్థిస్తారు. ఈ పవిత్ర పర్వదినం భక్తిభావాన్ని, దైవచింతనను, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించుకోవడానికి విశేషమైనదిగా భావిస్తారు.ఈ సందర్భంగా రాత్రి 7 గంటలకు స్వామివారి ఊరేగింపు సేవ ఆలయం నుంచి బయలుదేరి, తూర్పు రాజగోపురం పక్కన ఉన్న వేంచేపు మండపానికి చేరుకుంది. అక్కడ స్వామివారిని కొలువుదీర్చి శరత్ పూర్ణిమ వేడుకలను నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ స్వామివారికి, అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించి భక్తిపూర్వకంగా ఆరాధించారు. అనంతరం వివిధ రకాల భోగాలను నైవేద్యంగా సమర్పించారు. శరత్ పూర్ణిమ సంప్రదాయంలో భాగంగా పాలను చంద్రుని కాంతిలో ఉంచి, చంద్రదర్శనం అనంతరం స్వామివారికి సమర్పించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి భవానీ శంకర్, ప్రధానార్చకులు తాండూరు వెంకటాచార్యులు, సురేంద్ర చార్యులు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి సురేందర్ రెడ్డి, అర్చకులు, వేద పండితులు, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి కొండపైన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా ప్రత్యేక పూజలు

ఇది కద నిజం, యాదాద్రి : యాదాద్రి కొండపైన కొలువుదీరిన శ్రీ పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో శివుడికి అభిషేక పూజలు, రుద్ర హోమ పూజలు శాస్త్రోక్తంగా పండితులు నిర్వహించగా భక్తులు, స్థానికులు పాల్గొని శివ దర్శనం చేసుకున్నారు. ఉపవాసాలతో ఉన్న భక్తులు శివ దర్శనం, ప్రత్యేక పూజలు చేసి తమ మెక్కుబడులను చెల్లించారు. ఉదయం శివాలయంలో అర్చకులు అభిషేక పూజలు, శివాలయంలో జరుగు నిత్యపూజలో భాగంగా ఆలయ ఆవరణలో రుద్రహోమ పూజలను అర్చకులు, పండితులు శాస్త్రానుసారం నిర్వహించగా, శివాలయ ఆవరణలో మేళతాళాల మధ్య వేదమంత్రోచ్చరన గావిస్తూ శివుడిని ఊరేగించగా భక్తులు దర్శించుకున్నారు.

ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ

ఇది కద నిజం :వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకురాగా, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ కావడంతో పాటు, వారి సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కలుగుతుందని ఎస్పీ తెలిపారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా పరిగణించి, పారదర్శకంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని, ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 27-10-2026



వివాదంలో ప్రభాస్ 'ఫౌజీ'!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'. ఈ చిత్రంలో ఇమాన్వి ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ దిగ్గజాలు మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్, చైత్ర జె. ఆచార్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ ఫిల్మ్స్ అత్యంత గ్రాండ్‌గా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాను 2027 మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇక ఇటీవల ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా.. మేకర్స్ పవర్ ఫుల్ పోస్టర్‌తో పాటు గ్లింప్స్ విడుదలై చేసి ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేశారు. కానీ 'ఫౌజీ' సినిమా ఊహించని చిక్కుల్లో పడింది.

గ్లింప్స్‌లో చూపించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్రపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. నేతాజీ మునిమనవడు చంద్రకుమార్ బోస్ ఈ విషయంపై స్పందిస్తూ దర్శకుడు హను రాఘవపూడిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సినిమాలో చారిత్రక వాస్తవాలను పూర్తిగా వక్రీకరించారని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా హిట్లర్‌తో నేతాజీ భేటీ అయిన సన్నివేశాన్ని చూపించిన తీరు ఆయన గౌరవాన్ని తగ్గించేలా ఉందని, దీనిపై చిత్రబృందం భారత ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సృజనాత్మక స్వేచ్ఛ పేరుతో చరిత్రను తప్పుగా చూపించడం సరికాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ వివాదం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారడంతో.. నెటిజన్లు సైతం ఆయనకు సపోర్ట్‌గా నిలుస్తూ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

'కల్ట్' ప్రమోషన్‌లో గందరగోళం!

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న లేటెస్ట్ మూవీ 'కల్ట్'. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం దసరా కానుకగా అక్టోబర్ 30న థియేటర్లలోకి రాబోతోంది. వెంకటేష్ నటిస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాతో పోటీగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా విశ్వక్ సేన్ హైదరాబాద్‌లోని సారథి స్టూడియోలో అభిమానులతో ఫోటోలు దిగేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఊహించిన దానికంటే భారీ సంఖ్యలో ఫ్యాన్స్ తరలిరావడంతో అక్కడ తీవ్ర గందరగోళం నెలకొంది. ఒక్కసారిగా జనం పెరిగిపోవడంతో సరైన భద్రతా ఏర్పాట్లు లేక విశ్వక్ సేన్ ఈవెంట్ మధ్యలోనే వెళ్లిపోవాల్సి వచ్చింది. దీంతో ఎంతో ఆశగా వచ్చిన అభిమానులు ఫోటోలు దిగే అవకాశం దక్కక తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. ఈ సంఘటనపై విశ్వక్ సేన్ సోషల్ మీడియా వేదికగా ఒక ఎమోషనల్ నోట్ షేర్ చేస్తూ క్షమాపణలు కోరారు. ఈ సంఘటనపై విశ్వక్ సేన్ సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ నోట్ విడుదల చేస్తూ క్షమాపణలు కోరారు.



ఫ్యాన్స్ ఫోటో సెషన్ సమయంలో కలిగిన అసౌకర్యానికి మనస్ఫూర్తిగా క్షమాపణలు తెలుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. అభిమానుల నుంచి వచ్చిన స్పందన, ప్రేమ తాము ఊహించిన దానికంటే చాలా ఎక్కువ అయ్యి అంచనాలు దాటాయని చెప్పారు. ప్రతీ ఒక్కరినీ కలవాలని అనుకున్నప్పటికీ సరైన ఏర్పాట్లు లేకపోవడం, ఒక్కసారిగా జనం ఎక్కువ కావడంతో కలవలేకపోయానని వివరించారు. తనతో ఫోటో దిగాలని వచ్చి అవకాశం దక్కక నిరాశతో వెనుదిరిగిన ఫ్యాన్స్ అందరికీ సారీ చెప్పారు. త్వరలోనే మరింత మెరుగైన ఏర్పాట్లతో ఇంకో ఫ్యాన్ ఫోటో సెషన్ ఏర్పాటు చేసి, ప్రతీ ఒక్కరికీ అవకాశం దక్కేలా చేస్తానని హామీ ఇచ్చారు. తనపై చూపిస్తున్న ప్రేమకు, ఎప్పుడూ అండగా నిలుస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.అయినప్పటికీ నెటిజన్ల నుంచి విమర్శలు మాత్రం ఆగడం లేదు. అభిమానులు ఎంత సంఖ్యలో వస్తారో ముందుగానే అంచనా వేసి తగిన సెక్యూరిటీ ఏర్పాట్లు చేయాల్సిందని, అంత దూరం నుంచి వచ్చాక ఇప్పుడు సారీ చెప్పడం ఏంటని కొంతమంది మండిపడుతున్నారు.

విజయ్‌నే నా ప్రపంచం

తాజాగా కాఫీ విత్ కరణ్ ప్రోగ్రాంలో పాల్గొన్న విజయ్, రష్మిక మాట్లాడిన మాటలు ప్రస్తుతం నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. ఎవరి సొంత అభిప్రాయాలు వాళ్లకు ఉంటాయి అంటూ విరోష్ జంట మాట్లాడిన మాటలను కొందరు కావాలనే అసత్య ప్రచారం చేస్తుండగా.. తాజాగా క్లారిటీ ఇచ్చింది రష్మిక. 'నా గురించి, విజ్జు గురించి ఇంటర్నెట్‌లో ఉన్న ప్రజలకు చిన్న క్లారిటీ.. నేను సాధారణంగా ఇలాంటి విషయాలపై స్పందించను, ఎందుకంటే ప్రతి ఒక్కరికీ వారి అభిప్రాయాలు ఉండే హక్కు ఉంది. కొన్నిసార్లు నేను వాటిని చదివి, వేరే కోణాన్ని అర్థం చేసుకోవడానికి ట్రై చేస్తాను. కానీ మా ఇంటర్వ్యూపై ప్రస్తుతం నడుస్తున్న రచ్చ, ప్రజలు అభిప్రాయాలు చెప్పడంలా లేదు.. ఎవరో కావాలనే ఒక గుంపుగా టార్గెట్ చేస్తున్నట్లు ఉంది. ఎక్కడో మధ్యలో అసలు విషయం మారిపోయింది. బహుశా అది మీ దృష్టికి సరిపోలేదేమో. బహుశా మీలో కొందరు దాన్ని చూడటానికి ఇష్టపడటం లేదేమో.

నాకు ఏం కావాలో నిర్ణయించుకునే హక్కు నాకుంది. అదే విధంగా అతడికి ఏం కావాలో ఆలోచించుకుని నిర్ణయం తీసుకునే హక్కు అతడికి కూడా ఉంది. అందుకే ప్రపోజల్ సంఖ్య మార్చలేదు. నేను పూర్తిగా హృదయంతో ఆలోచిస్తాను, అతను ఆలోచించే వ్యక్తి.. మా ఇద్దరి జీవితాల్లో ఒకరికొకరు అది అవసరం. మాకు, పెళ్లి అనేది ఒక ప్రపోజల్, మోకాళ్లపై నిలబడటం లేదా వేలికి ఉంగరం తొడగడం గురించి ఎప్పుడూ కాదు. అవన్నీ కేవలం అలంకరణ మాత్రమే. మాకు, పెళ్లి అనేది కలిసి ఒక జీవితాన్ని, భవిష్యత్తును నిర్మించుకోవడం గురించి. ఇప్పటి వరకు మేము చాలా ఆనందంగా ఉన్నాము. అవును, నేను నా భర్త పిచ్చి ప్రేమలో మునిగిపోయాను. పెళ్లి చేసుకునే వ్యక్తిని ప్రేమించకపోతే, పెళ్లి ఎందుకు. అతను జీవితాంతం నా తోడుగా ఉండబోతున్నాడు. నా సాధారణ రోజుల్లోనూ, అసాధారణ రోజుల్లోనూ నా స్నేహితుడు. నా పిల్లలకు తండ్రి. నేను కలిసి వృద్ధురాలినయ్యే నా మనిషి. కాబట్టి నేను 100 సార్లు కాదు 1000 సార్లు ప్రపోజ్ చేస్తాను' అంటూ విజయ్‌తో క్లోజ్‌గా ఉన్న ఓ క్యూట్ వీడియోను షేర్ చేసింది.





జనవరి 1న ప్రారంభం?

అగ్ర కథానాయకుడు రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందనున్న 'ఆర్సి17'(వర్కింగ్ టైటిల్) సినిమా ప్రారంభోత్సవం ఎప్పుడు? అనే విషయంపై గత కొన్ని రోజులుగా చర్చ నడుస్తూనే ఉన్నది. ఈ నెలలోనే సినిమా లాంఛనంగా మొదలవ్వనున్నదని నిర్మాతలే గతంలో చెప్పారు. అయితే.. తాజాగా చిత్ర నిర్మాతల్లో ఒకరైన మైత్రీ రవిశంకర్ 'ఆర్సి17' ప్రారంభోత్సవంపై క్లారిటీ ఇచ్చారు. నవంబర్ 1న ఘనంగా ఈ చిత్రం ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

అంతేకాదు, ఆ రోజు నుంచే నిరవధికంగా చిత్రీకరణ మొదలవుతుందని ఆయన చెప్పారు. ఇక ఈ సినిమా కథ విషయానికొస్తే..స్టైలిష్ యాక్షన్, మాస్, లవ్ ఎంటర్‌టైనర్‌లతో వరుసపెట్టి సినిమాలు చేసిన డైరెక్టర్ సుకుమార్.. 'రంగస్థలం' నుంచి స్టైల్ మార్చారు. రూటెడ్ స్టోరీలతో ఆడియన్స్‌ని కట్టిపడేశారు. మళ్లీ ఇప్పుడు రామ్‌చరణ్ సినిమాతోనే ఆయన పంథా మార్చనున్నారు. రామ్‌చరణ్‌తో సుకుమార్ చేయనున్న ఈ సినిమా స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని తెలుస్తున్నది.

సారా అర్జున్, ప్రీతి ముకుందన్ వీరిద్దరిలో ఎవరో ఒకర్ని ఇందులో కథానాయికగా ఎంపిక చేస్తారంటూ మొన్నటిదాకా వార్తలొచ్చాయి. ఇప్పుడు తాజాగా 'సయారా' ఫేం అనీత్ పడ్డా పేరు బలంగా వినిపిస్తున్నది. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.

'స్వయంభు' విజువల్స్‌కు నిఖిల్ ఫిదా!

'కార్తికేయ 2'తో దేశవ్యాప్తంగా సెన్సేషన్ క్రియేట్ చేసిన యంగ్ హీరో నిఖిల్, ప్రస్తుతం తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'స్వయంభు'తో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఒక పీరియాడిక్ యోధుడి కథతో, అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎప్పటినుంచో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించి నిఖిల్ స్వయంగా సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతుంది.

ఈ సినిమా గ్రాఫిక్స్ పనులను ఫాంటమ్ ఎఫ్ఎక్స్ టీమ్ చేస్తోంది. తాజాగా వాళ్లు రెడీ చేసిన కొన్ని సీన్లను చూసిన నిఖిల్‌కు సంతోషం వేసిందట. ఆ విజువల్స్ చూసి ఆయనకు మాటలు రాలేదని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన తన ఆనందాన్ని ఎక్స్ వేదికగా ఫ్యాన్స్‌తో పంచుకున్నారు. "ఇప్పుడే 'స్వయంభు' వీఎఫ్ఎక్స్ షాట్స్ కొన్ని చూశాను. ఫాంటమ్ ఎఫ్ఎక్స్ వాళ్లు మామూలుగా చేయలేదు.. అవుట్‌పుట్ చూసి నాకైతే మైండ్ బ్లాంక్ అయింది. ఇంత పెద్ద సినిమాను ఎప్పుడెప్పుడు బిగ్ స్క్రీన్‌పై చూస్తానా అని అస్సలు ఆగలేకపోతున్నా. థియేటర్లలో మీకు ఒక రేంజ్ విజువల్ ట్రీట్ పక్కా. ఈ ఏడాదే సినిమాతో వచ్చేస్తున్నాం" అంటూ టీమ్ మొత్తాన్ని ట్యాగ్ చేస్తూ నిఖిల్ పోస్ట్ పెట్టారు.

ఈ సినిమాలో నిఖిల్ మునుపెన్నడూ చూడని విధంగా ఒక పవర్‌ఫుల్ యోధుడిగా కనిపించనున్నారు. ఇందుకోసం ఆయన గుర్రపు స్వారీ, మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను ఠాగూర్ మధు, బిజోయ్ రాజ్ ఎక్కడా తగ్గకుండా నిర్మిస్తున్నారు. పీరియాడిక్ సినిమాలకు గ్రాఫిక్స్ ఎంత ముఖ్యమో అందరికీ తెలిసిందే. ఇప్పుడు నిఖిల్ స్వయంగా వీఎఫ్ఎక్స్ అదిరిపోయిందని చెప్పడంతో ఈ సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పీక్స్‌కు చేరాయి.

